నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | ఏప్రిల్ 02, 2024 | www.navatelangana.com

అపరిచితులకు ఓటీపీ చెప్పొద్దు


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్ఐ

- సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

అపరిచితులు ఫోన్ చేసి ఓటిపి నెంబర్ అడిగితే చెప్పవద్దని బిబిపేట్ పోలీసులు సూచించారు. బిబిపేట్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సోమవారం సైబర్‌నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మీరు లక్కీ డ్రాలో గెలుపొందారని మీకు డబ్బులు వస్తాయని, మీ అకౌంట్ లాక్ అయిందని తదితర విషయాలు చెప్పి ఓటీపీ చెప్పాలని అపరిచితులు ఫోన్ చేస్తారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మీరు ప్రయాణం చేసే సమయంలో బస్సుల్లో దొంగలు ఉంటారని ఫోన్లను, బ్యాగులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, సిబ్బంది ప్రవీణ్, సాయిలు, శ్రీకాంత్, తదితరులున్నారు.

నిజాంసాగర్ కెనాల్‌కట్టకు గండి


కాలువకు గండిపడటంతో ఇండ్లల్లోకి చేరుతున్న నీరు

- ఇండ్లల్లోకి చేరిన నీళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో సోమవారం తెల్లవారు జామున నిజాంసాగర్ కెనాల్‌కు గండిపడింది. దీంతో నీరు ఇండ్లల్లోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

స్థానిక జర్నలిస్ట్ కాలనీకి ఆనికొని ఉన్న నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ 82 నెంబర్ కెనాల్ కట్టకు ఒక్కసారగిగా గండిపడింది. దీంతో నీరు ఇండ్లల్లోకి చేరడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురైయ్యారు.

ప్రణాళికాబద్ధంగా తాగు నీటి సరఫరా

- ప్రతి నివాస ప్రాంతానికి సరఫరా జరిగేలా కార్యచరణ
- నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధర పై కొనుగోలు
- అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు
- సీఎస్‌తో సమీక్ష అనంతరం కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రానున్న 2 నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగు నీటి సరఫరా చేపట్టాలని , ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వేసవిలో తాగు నీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ హాల్ నుండి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ, వేసవి కాలంలో తాగు గునీటి సరఫరా పై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధంగా ఉండాలని, రోజువారీగా తాగు నీటి సరఫరా తీరును పర్యవేక్షించాలని, ఆయా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో , గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సి ఎస్ కలెక్టర్లకు సూచించారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందు బాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో స్థానికంగా ఉన్న వ్యవసాయ బోరుబావులను తాగునీటి అవసరాల కోసం వినియోగించు కోవాలని అధికారులకు సూచించారు. పట్టణాలలో, గ్రామాలలో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అన్నారు.

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గి పోతున్నాయని, పట్టణాలు , నగరాలలో, గ్రామీణ ప్రాంతాలలో సైతం ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సకాలంలో సరఫరా చేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రం అందుబాటులో లేదు అనే ఫిర్యాదు రాకూడదని సీఎస్ స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ అంశంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2203, సాధారణ రకం ధాన్యానికి 2183 మద్దతు ధర చెల్లించరనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మన రైతుల వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా ,టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సి ఎస్ సూచించారు.

అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం : కలెక్టర్

ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, జిల్లాలో ప్రస్తుత యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. మొత్తం 466 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించామని, ఇప్పటికే 144 కేంద్రాలను రైతులకు అందుబాటులో తెచ్చామని అన్నారు. మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా అధికారులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేశామన్నారు.

కాగా, వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సి.ఎం.ఆర్, రా రైస్ డెలివరీ పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ సూచించారు.

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్ మేజర్ మరమ్మత్తులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీని నియమించాలని , క్షేత్రస్థాయిలో మరోసారి పాఠశాలలను తనిఖీ చేసి పక్కగా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎస్ అన్నారు. ప్రతి మండల స్థాయిలో పాఠశాల మౌలిక వసతుల కల్పన పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ,ఎంపీడీవో , పాఠశాల నిర్వహణ కమిటీ లో ఉన్న స్వశక్తి మహిళా సంఘాల తో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని అన్నారు.

ఎండ తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండ తీవ్రత రోజు రోజుకు కు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వడ దెబ్బల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కూలీలకు అవసరమైన నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు . వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని, బయటకు వస్తే అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేశ్

ఎస్ఎఫ్ఐ నుంచి బోడ అనిల్ బహిష్కరణ

- సంఘం వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడినట్టు ఎస్ఎఫ్ఐ నాయకుల వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన బోడ అనిల్‌ను ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ ఆర్థిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఎస్ఎఫ్ఐ సంఘం నిబంధనలను అతిక్రమించడం వలన ఎస్ఎఫ్ఐ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐకి అనిల్, సాయికుమార్, సందీప్ లకు ఎలాంటి సంబంధం లేదని ప్రెస్‌మీట్ ముఖంగా విద్యార్థులకు, ప్రైవేట్ ప్రభుత్వ యాజమాన్యాలకు తెలియజేశారు. నిజామాబాద్ జిల్లాలో విద్యారంగా సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడు పోరాటం నిర్వహించడంలో ముందుం టుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపికా, నగర అధ్యక్షులు గణేష్, వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- నిజాంసాగర్ కాలువలో ఒక వైపు కబ్జా, మరోవైపు పూడిక
- చర్యలు చేపట్టని అధికారులు



నవతెలంగాణ-ఆర్మూర్

సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయడంతో నిజాంసాగర్ కాలువకు గండి పడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఒక వేళ భారీ వర్షాలు కురిసి కాలువ ఉధృతంగా ప్రవహిస్తే తమ పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని సోమవారం నిజాంసాగర్ కెనాల్ కట్ట తెగి ఇళ్లల్లోకి నీళ్లు చేరి జనజీవనం అస్తవ్యస్తం అయింది. ఇదే నిజాంసాగర్ కెనాల్ కాలువ మండలంలోని అంకాపూర్ నుండి మామిడిపల్లి ద్వారా గోవింద్ పెట్ తదితర గ్రామాల రైతాంగానికి సాగునీరు అందించే విడుదల చేయగా.. మామిడిపల్లి కెనాల్ ప్రాంతంలో రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి పై వరకు నీళ్లు రావడం తో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువ క్రమంగా కబ్జాకు గురవుతుండటం, పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించకపోవడం, ఎప్పటికప్పుడు చెత్తచెదారం తొలగించకపోవడంతో కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

అంగన్‌వాడీ ఆయ హత్యనా, ఆత్మహత్యనా..?


ఆందోళన చేపట్టిన బంధువులు, గ్రామస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఆయా అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దండబోయిన మణెమ్మ (41) మండల కేంద్రంలో అంగన్వాడీలో ఆయాగా పనిచేస్తుంది. సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త ఇరుగుపొరుగు వారికి తెలిపారు. కాగా గ్రామస్తులు, బంధువులు చేరుకొని శవాన్ని పరిశీలించి, భర్త బైరయ్య, అదే కాలనీలో ఉంటున్న ఓ మహిళతో చాలా రోజుల క్రితం నుండి వివాహేతర సంబంధం నెరుపుతున్నాడని, అడ్డు తొలగించుకోవడానికి ఇద్దరు కలిసి హత్య చేశారని బంధువులు ఆరోపించారు. ఇద్దరిని బంధువులు చితకబాదారు. సమాచారం అందుకున్న సీఐ రామన్, ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయం జరిగే వరకూ శవాన్ని మహిళా ఇంటి ముందట ఉంచి, బంధువులు ఆందోళన చేపట్టారు. బంధువులను శాంతింప చేయడానికి పోలీసులు అనేక రకాలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భర్తను పోలీసులకు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని డాగ్స్ స్కార్డు తో తనిఖీలు నిర్వహించారు.

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలి

- సొసైటీ మహాజన సభలో రైతుల తీర్మానం

నవతెలంగాణ-నిజాంసాగర్

రైతుల రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో చెల్లించాలని సింగిల్ విండో మహాజనసభలో రైతులు కోరారు. నిజాంసాగర్ మండలంలోని మల్లూరు ప్రాథమిక సహకార సంఘంలో మహాజనసభను సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘంలో ఏడు కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని ఆమె తెలిపారు. రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మహాజనసభలో రైతులు డిమాండ్ చేశారని, ఈ సంవత్సరం నీటి కొరత ఉన్నందున అధిక సంఖ్యలో జొన్న పంటలు రైతులు వేశారని వాటికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేపట్టాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సన్న రకం ఏ గ్రేడ్ ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోహర్, పాలకవర్గ సభ్యులు గంగారం, సప్పెట్టి నారాయణ, అంజయ్య సంఘ సీఈవో కోటగిరి సాయిలు, బాబు సెట్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

83 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ప్రారంభం


కంట్రోల్ రూం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి/భిక్కనూర్

కామారెడ్డి జిల్లాలో 83 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న కంట్రోల్ రూమ్ నెంబర్ 08468- 220051కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 326, ఐకెపి ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంకా 265 కొనుగోలు కేంద్రాలు వారం రోజుల వ్యవధిలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

భిక్కనూర్ : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయిం చాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో ఏ గ్రేడ్ రూ.2203, బి గ్రేడ్ రూ.2183 చెల్లిస్తుందన్నారు. వరి ధాన్యంలో తాళ్లు, పొట్టు, మట్టి పెల్లలు, రంగు మారిన ధాన్యాన్ని బి గ్రేడ్ గా పరిగణించబడుతుందని. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఎలాంటి చెత్తా, తాళ్లు, పొత్తులేని ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా, 17 శాతం లోపు తేమశాతం ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, సాయిలు, ఏడిఏ అపర్ణ, ఏవో రాధా, క్లస్టర్ ఆఫీసర్ రమేష్, సొసైటీ సీఈఓ మహేశ్వరి, ఏఈఓ ఆనంద్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

ఎంపీపీపై వీగిపోయిన అవిశ్వాసం

నవతెలంగాణ-రామారెడ్డి

స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్‌రెడ్డి గతంలో ఏడుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన నోటీసులు ఆర్డీవోకు అందజేయగా, సోమవారం ఆర్డీవో రంగనాథ్‌రావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రోజా, ఎంపీడీఓ సవితరెడ్డితో కలిసి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. సభ్యులు హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్‌డిఓ రంగనాథరావు ప్రకటించారు. అనంతరం ఎంపీపీ దశరథ్‌రెడ్డితో పాటు బిఆర్ఎస్ నాయకులు అంబేద్కర్‌కు పూలమాలలు వేశారు. దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, కొందరు ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరి, సభ్యులను అవిశ్వాసం పెట్టారని, తెలంగాణ ఉద్యమకారునిగా, చేసిన అభివృద్ధిని చూసి, వాస్తవాలను తెలుసుకొని మద్దతు ఇచ్చిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం .జగన్మోహన్ గౌడ్


జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన జగన్మోహన్ గౌడ్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా కోర్టులోని డిఎల్ఎస్ఎ హాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు మాట్లాడుతూ నిజామాబాద్ బార్ లో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం చేయడం, జూనియర్ న్యాయవాదులకు సహకారాన్ని అందించడం, సెమినార్ నిర్వహించడం తోపాటు అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కమిటీ బార్ అండ్ బెంచ్ సహకారంతో ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఎన్నికల అధికారి ఆముదాల సుదర్శన్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయమూర్తులు, కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఉపాధ్యక్షులు పి. రాజు, జాయింట్ సెక్రెటరీ సురేష్, కోశాధికారి దీపక్, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్,మహిళ ప్రతినిధి కవిత రెడ్డి కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, రాజలింగం, కృపాకర్ రెడ్డి,ఆజార్ కిషన్ రావు, పి వెంకటేష్, విగ్నేష్, బట్టు మాణిక్ రాజ్, బి రవి, నీరజ రెడ్డి, అరటి నారాయణ, శివాజీ, రజిత, మరియు సీనియర్ జూనియర్ మహిళ న్యావదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే లింగాయతులకు సరైన న్యాయం

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లింగాయత్ సమాజ్‌కు సరైన న్యాయం చేకూరుతుందని గతంలో లింగాయత్ సమాజాన్ని బీసీలకు మార్చడం, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాయత్ సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు కొడిచెర తాజామాజీ సర్పంచ్ సంతోష్ పటేల్ అన్నారు.

లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ చిత్రపటాలకు గ్రామ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోడిచర గ్రామ లింగాయత్ అధ్యక్షులు బుక్కవర్ మారుతి, ఉపాధ్యక్షులు పొట్టేవార్ గంగాధర్, గ్రామ మాజీ సర్పంచ్ సంతోష్ పటేల్, బోలేవార్ ఉమాకాంత్, శివకుమార్, జుబ్రే బస్వంత్, హనుమంత్, సుభాష్, సురేష్ లింగాయత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా

రుద్రూర్, ఆలూర్, డొంకేశ్వర్, బోధన్‌టౌన్

కామారెడ్డి జిల్లా

కామారెడ్డి రూరల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ రూరల్ బీర్కూర్, బీబీపేట్, రాజంపేట్, మాచారెడ్డి, దోమకొండ రూరల్

నవతెలంగాణ బుక్‌హౌస్‌లో ఉద్యోగ అవకాశం కలదు

ఇంటర్వ్యూ తేదీ : 07.04.2024
సమయం : ఉదయం 11 గంటలకు
అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు :
94945 73764, 94900 99408

నరసింహస్వామి ఆలయంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మద్దుల్ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఎంపీపీ దంపతులు నల్ల సారిక హన్మంత్ రెడ్డి ఆలయంలో వినాయకుడి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. అలాగే గోవింద్‌పల్లి గ్రామస్తులైన కుర్రోళ్ళ బొర్రన్న ఆలయ ఆవరణలో ధ్వజ స్థంభం ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ నాగయయోల్లా గంగారెడ్డి, కచ్చకాయల బాలు, నల్ల చిన్నయ్య మంచికంటి ప్రశాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపనకు సిద్ధం

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో శ్రీ లక్ష్మణ సహిత సీతారామాంజనేయ ప్రతిష్టాపన కోసం ఆలయం ముస్తాబైంది. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవ మహోత్సవం గ్రామ కమిటీ, రామాలయ కమిటీ, గ్రామ ప్రజల చేత నిర్వహించనున్నారు. 4న ఉదయం 09.05 గంటలకు యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ స్థిర ప్రతిష్టాపన మహోత్సవము నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.



ముస్తాబైన ఆలయం

ఇఫ్తార్ విందు ఏర్పాటు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని అభయ హస్తం కాలనీలో రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు హుస్సేన్, ఎంపీజే నాయకులు జహీరుద్దీన్, ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్ నవాజ్, మైనార్టీ మోర్చ నాయకులు అన్వర్, ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ధ్యారంగుల కృష్ణ వీరు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. కార్యక్రమంలో అభయ హస్తం కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు షేక్ మున్వర్ రహమత్, శ్రీధర్, గంగాధర్, స్వప్న, లావణ్య అఖిల్, 300 మంది ప్రజలు పాల్గొన్నారు.

బీసీల కోసం నా వంతు కృషి చేస్తా

- తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

బీసీల కోసం నా వంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. సోమవారం కిసాన్‌నగర్ గ్రామంలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈరవత్రి అనిల్‌కు రాష్ట్రస్థాయి పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీల కోసం నా వంతు కృషి చేస్తానని ఈరవత్రి అనిల్ అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండలాధ్యక్షులు, మాజీ ఎంపీపీ మనేటి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి రామనాథం, పద్మశాలి సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎలిగేటి మధుకర్, సహాయ కార్యదర్శి తమ్మే కపిల్, కోశాధికారి పొన్న రాజేందర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలివేరి లక్ష్మీనారాయణ, పుట్టవత్రి పురుషోత్తం, ముల్క జగదీష్, రేగొండ సిద్దయ్య, మండల సంఘం సలహాదారుడు వన్నెల్ దాస్ గంగాధర్ పాల్గొన్నారు.

డిపో ఉద్యోగి మృతిపై సంతాపం

నవతెలంగాణ-బోధన్



డిపోలో అసిస్టెంట్ డిపో కంట్రోలర్‌గా పనిచేస్తున్న భాస్కర్ అనారోగ్యంతో ఆదివారం తన నివాసంలో మృతి చెందారు. ఆయన మృతి సందర్భంగా బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్ కార్మికులతో కలిసి సోమవారం సంతాపం పాటించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కోన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు యాదు, పుట్ట బాలగౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం

సకాలంలో ఫారం-12(డి) సమర్పించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోస్టల్ బ్యాలెట్ కోసం అవకాశం కలిగి ఉండి, దానిని వినియోగించదల్చిన వారు ఈ నెల (ఏప్రిల్) 20వ తేదీలోపు నిర్ణీత ఫారం-12(డి) పూరించి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సోమవారం అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందని అన్నారు. అయితే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని నోడల్ అధికారులకు సూచించారు. ఏప్రిల్ 20వ తేదీలోపు సమర్పించే ఫారం - 12(డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఫారం-12 (డీ) దరఖాస్తులు నోడల్ అధికారి నుంచి, లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నుండి కూడా పొందవచ్చని, ఎలక్షన్ కమిషన్ పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్.ఓ కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వారు నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆర్.ఓ ఆఫీసులో, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ వారు నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని వారు బాన్సువాడ ఆర్డీఓ ఆఫీస్‌లో, బోధన్ సెగ్మెంట్‌కు చెందిన వారు బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో, ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని వారు ఆర్మూర్ ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్.ఓ ఆఫీసులో, బాల్కొండ సెగ్మెంట్‌కు చెందిన వారు భీంగల్ మండల కేంద్రంలోని ఎం.పీ.డీ.ఓ కార్యాలయంలో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవీసీ) అందుబాటులో ఉంటుందని తెలిపారు. అయితే ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మే 13 న నిర్వహించే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదని, ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి విజయేందర్ రెడ్డి, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించేందుకు ఫారం 12-డీ పంపిణీ..

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో 85 సంవత్సరాల వయస్సు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యంగులు ఇంటి వద్ద నుండే ఓటు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారికి ఎలక్షన్ కమిషన్ ద్వారా నిర్దేశించబడిన నిర్ణీత ఫారం 12-డీ లను పంపిణీ చేయిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు ఓటరు జాబితాలో మార్కింగ్ చేయబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యంగ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఫారం 12-డీ అందజేస్తున్నారని అన్నారు. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 7555 మంది ఉండగా, మార్చి 30 నాటికే 3331 మందికి ఫారం 12-డీ అందజేయడం పూర్తయ్యిందని వివరించారు. అదేవిధంగా దివ్యాంగులైన ఓటర్లు 24,229 మంది ఓటరు లిస్టులో మార్కింగ్ చేయబడి ఉండగా, వారిలో 10,175 మందికి నిర్ణీత ఫారాలను సమకూర్చినట్టు తెలిపారు. అర్హత కలిగి ఉన్న 85 ఏళ్ళు పైబడిన, దివ్యాంగ ఓటర్లందరికీ, వారు ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా ఫారం 12-డీ అందజేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇంటి నుండి ఓటు వేయదల్చిన వారు తమ సమ్మతి తెలుపుతూ పూరించిన ఫారం 12-డీని ఈ నెల 20వ తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ, పోలింగ్ అధికారుల బందాలు వారి ఇళ్లకు వెళ్లి పూర్తి పారదర్శకంగా వీడియో చిత్రీకరణ నడుమ ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని, సీక్రెట్ ఓటింగ్ కోసం ఓటింగ్ కంపార్ట్ మెంట్‌ను కూడా ఏర్పాటు చేస్తారని అన్నారు. కాగా, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13 శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. దీనిని వినియోగించదల్చిన వారు సైతం ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫారం-12 (డి)లు అందించాలని కలెక్టర్ సూచించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూర్ తిరుమల ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలను నిర్వహించారు. దేవదేవుల ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న దేవనాథ జీయర్‌స్వామి, అహోబిల జీయర్‌స్వామి, స్వామివారికి వాహన సేవ నిర్వహించడం వల్ల జరిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామివారు, ఆలయ ధర్మకర్తలు, నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, రవియాదవ్ నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, గంగారెడ్డి, లక్ష్మి, పాల్గొన్నారు.



ఉత్సవమూర్తుల ఊరేగింపు

డిఐఈఓగా రవికుమార్ బాధ్యతలు స్వీకరణ



నూతన బాధ్యతలు స్వీకరించిన రవికుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ)గా రవికుమార్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రఘురాజ్ ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో, రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనర్ రవికుమార్‌ను జిల్లా ఇంటర్ విద్య అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. రవి కుమార్ వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, ఇటీవలే ఇంటర్ విద్య మూల్యాంకన కేంద్రం అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా సోమవారం నుంచి జిల్లా ఇంటర్ విద్యాధికారిగా కూడా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షులు చిరంజీవి ఆధ్వర్యంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సన్మానించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షులు నరసయ్య ఆధ్వర్యంలో, ఇతర యూనియన్ల లెక్చరర్ల సంఘ నాయకులు ఇంటర్ విద్య అధికారి రవికుమార్‌ను సన్మానించారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని మెండోరా గ్రామంలో లాక్య తండాను అడిషనల్ కలెక్టర్ అంకిత్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటిని పరిశీలించారు. ఆయన వెంట గంగామోహన్, ఎంపీఓ, సందీప్ తదితరులున్నారు.

బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ న్యాయస్థానంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి నసిం సుల్తానా అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని సోమవారం సన్మానించారు. ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడేటి శంకర్, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్ కుమార్, కోశాధికారి తుమ్మ సుకేష్, సంయుక్త కార్యదర్శి సిందుకర్ చరణ్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌కు ఎన్నికల అధికారులు గటాడి ఆనంద్, తాళ్ళ శ్రీనివాస్ పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భూపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నరేందర్, జగదీష్, ఏలేటి గంగాధర్, సురేష్, టికె కోనేరు, క్రిష్ణం రాజు, ఐనారి అశోక్, ప్రవీణ్ కుమార్, రమేష్, విజయలక్ష్మి, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని సన్మానించిన పలువురు

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

వర్ని(చందూర్) : రైతుల పండించిన ప్రతి వరి గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళనకు గురికావద్దని గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి సౌజన్య అన్నారు. చందూర్ సహకార సంఘం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామీణ వ్యవసాయ విస్తరణ అధికారి సౌజన్య, సీఈఓ భూమయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

హుమ్నాపూర్‌లో కొనుగోలు కేంద్రం..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్నాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు సీఈవో సాయిలు ప్రకటనలో తెలిపారు. సన్నకారు, చిన్నకారు రైతులందరూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని తెలిపారు. సొసైటీ నుంచి ప్రతి ఒక్క రైతు నుంచి ప్రతి గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : రైతులు పండించిన వరి పంట ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి రైతులను కోరారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను అధ్యక్షులు పోల మల్కారెడ్డి ప్రారంభించారు. ఏ గ్రేడ్ రూ.2203, బి గ్రేడ్ రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లాభాలు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజారామ్, పిఎసిఎస్ సిబ్బంది బేగరి సాయిలు, ప్రభాకర్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ రాములు నాయక్, నారెడి రత్న, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మల్లేశం, సరిదాస్, భీమ్లా నాయక్, నారాయణరెడ్డి సిరాజుద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పిపిసి హెగ్డోలిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఎఇఒ శంకర్, పిపిసి ఇంచార్జి సుధాకర్‌రెడ్డి, అర్జున్, హనుమండ్లు, నారాయణ, మనోహర్, హమాలి హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

రెంజల్ : రైతులు పండించిన పంటను ప్రభుత్వం కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధిక్కరించి మద్దతు ధరను పొందాలని సీఈఓలు జీవన్ రెడ్డి, రాందాస్‌లు స్పష్టం చేశారు. మండలంలోని దుపల్లి, నీలా, సింగిల్ విండోల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. అధికారుల ఆదేశాల మేరకు ఏ గ్రేడ్ రూ.2203, బి గ్రేడ్ రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు, శేషగారి భూమారెడ్డి, ఇమామ్ బేగ్, రైతులు గంగాధర్, గంగారెడ్డి, గోసుల గంగా కిషన్, ఎంఎల్ రాజు, ఏఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని చిక్లీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బుర్రోల్ల అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. ధాన్యం దొడ్డు రకం ధర రూ.2203, సన్నరకం ధర రూ.2183 ఉందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, కార్యదర్శి సంతోష్, రైతులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్టలో ఆగ్రోస్ ఆధ్వర్యంలో..

రెంజల్ : మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో ఆగ్రోస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆగ్రో యజమాని సనా తెలిపారు. రైతుల పండించిన పంట దళారులకు ఇవ్వకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన సూచించారు. 17శాతం తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రం ఈ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ సిబ్బంది రాజు, రైతులు సాయిలు, రాజా గౌడ్, భూదేవి, రైతు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



వర్ని: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి సౌజన్య, సీఈఓ భూమయ్య,



ఎడపల్లిలో...



పోతంగల్‌లో...



రెంజల్‌లో...



మాక్లూర్‌లో...

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయ ఆలయ నిర్మాణ కమిటీ గ్రామ పెద్దలు గ్రామస్తుల సమక్షంలో వేదమంత్రాలతో సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఆలయానికి నిర్మాణానికి భూమిపూజ

ఆలయంలో శీతల్ ఉత్సవం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో సోమవారం ఉదయం రాజస్థానీ సమాజ్ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం హెూళీ పండుగ తర్వాత సరిగ్గా వారం రోజులకు 'శీతల్ ఉత్సవం' చేపడతామని, ఈ రోజు గ్రామ దేవత పోచమ్మ ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి అందరూ సుఖ: సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.


పూజలు చేస్తున్న రాజస్థానీ సమాజ్ మహిళలు

'రెండింతల' మోసం

- కట్టిన డబ్బులు చెల్లించని వెల్ఫేర్ గ్రూప్
- మూసివేత దిశగా కార్యాలయాలు
- ఎవరిని అడగాలో తెలియక ఆవేదన చెందుతున్న బాధితులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని డబ్బులు కడితే.. మూడునాలుగేండ్లకు రెండింతలు ఇస్తామని నమ్మబలికి ఓ సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో తాము కట్టిన డబ్బులు ఎవరిని అడగాలో తెలియక బాధితులు వాపోతున్నారు. మరికొందరు పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

15 సంవత్సరాల క్రితం వెల్ఫేర్ బిల్డింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కామారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, సంగారెడ్డి, నారాయణఖేడ్, హైదరాబాద్ ప్రాంతాలలో బ్రాంచ్ లను ఏర్పాటు చేసి బ్రాంచ్ లలో జీతాలు, కమీషన్లు ఇస్తామని ఏజెంట్లను నియమించుకుంది. వెల్ఫేర్ కంపెనీలో డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే ఐదు సంవత్సరాలలో రెండింతలు ఇస్తామని, నెలనెలా కొంత డబ్బులు చెల్లించినా మూడు సంవత్సరాలు చెల్లిస్తే రెండు సంవత్సరాల తర్వాత వడ్డీతో సహా చెల్లించడం, ఫిక్స్ డిపాజిట్ చేసిన వారు ఐదు సంవత్సరాల తర్వాత రెండింతల డబ్బులు లేదా ల్యాండ్ ఇవ్వడం వంటి స్కీములతో ప్రజల నుండి డబ్బులు వసూలు చేశారు.

సదరు కంపెనీ ప్రారంభంలో బాగానే కొనసాగినా.. తర్వాత నష్టాలను చవిచూడటంతో డబ్బులు చెల్లించిన వారికి డబ్బులు ఇవ్వలేక, రాష్ట్రంలో సంస్థను నడిపించలేక ఒక్కొక్క బ్రాంచ్‌ను మూసి వేస్తూ వెళ్లిపోవడంతో డబ్బులు చెల్లించిన బాధితులు స్థానికంగా ఉన్న ఏజెంట్లను పట్టుకొని మా డబ్బులు మాకు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. సంస్థ ఏజెంట్లు తెలంగాణ రాష్ట్రంలోనే వెల్ఫేర్ సంస్థ మూసివేయడం జరుగుతుందని సంస్థ యొక్క మెయిన్ బ్రాంచ్ విశాఖపట్నంలో ఉందని అక్కడికి వెళ్తే.. మీ డబ్బులు మీకు ఇస్తారని తెలియజేయడంతో బాధితులు అక్కడికి వెళ్లకుండా స్థానికంగా ఉన్న ఏజెంట్లే మా డబ్బులు తిరిగి ఇవ్వాలని తెలియజేస్తున్నారు.



ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కేవలం కామారెడ్డి, హైదరాబాద్ బ్రాంచ్‌లు మాత్రమే ఓపెన్ ఉన్నాయని మిగతా బ్రాంచ్లు మూసివేయడంతో బాధితులు వెల్ఫేర్ కంపెనీ చుట్టూ తిరుగుతున్నారు. స్థానికంగా ఉన్న వెల్ఫేర్ సంస్థ మేనేజర్లు, ఏజెంట్లు ఉన్న డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న కారణంగా బాధితులకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక కొందరు ఫోన్లు స్విచ్ ఆఫ్ పెట్టుకోవడం మరికొందరు న్యాయం చేస్తానని భరోసా ఇవ్వడం చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షల్లో బాధితులు ఉండగా వారికి చెల్లించాల్సిన డబ్బులు కోట్ల రూపాయలు ఉన్నాయి. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1500 మంది బాధితులు కామారెడ్డి ప్రాంతంలో ఉన్న వెల్ఫేర్ సంస్థ కార్యాలయం చుట్టూ ప్రతిరోజు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు బాధితులు ఇటీవల కాలంలో కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుండి వెల్ఫేర్ సంస్థకు నోటీసులు అందజేసిన ఎలాంటి సమాధానం రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం స్థానికంగా ఉన్న ఏజెంట్లు మీ డబ్బులు ఎక్కడికి పోవాలి తప్పకుండా వస్తాయని భరోసా ఇస్తున్నారే తప్ప కాల వ్యవధి ముగిసిన తర్వాత కూడా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. చిన్నచిన్న డబ్బులు ఉన్నవారు తిరిగి తిరిగి అలసిపోగా పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించిన వారు కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు.

వెల్ఫేర్ సంస్థలు డబ్బులు చెల్లించి ఎవరైతే సంస్థ యాజమాన్యంపై తిరగబడుతున్నారు వాళ్లకు త్వరగా డబ్బులు ఇవ్వడం చేస్తున్నారని, తిరిగి తిరిగి అలసిపోయి చాలించుకున్నవారు చాలామంది ఉన్నారని బాధితులు తెలుపుతున్నారు. కొందరు బాధితులు విశాఖపట్నం వెళ్లి మెయిన్ బ్రాంచ్‌లో రావాల్సిన డబ్బులు చెక్కు రూపంలో తీసుకొని వచ్చిన కొన్ని బౌన్స్ అవుతున్నాయని బాధితులు తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్న మరికొందరికి స్థలాలను ఇవ్వడం వంటివి చేస్తున్నారని అది కూడా పూర్తిస్థాయిలో స్థలాలు చూపించి రిజిస్ట్రేషన్ చేయించలేం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూతురు పెళ్లి కోసం దుబాయ్ నుండి డబ్బులు పంపిన



- రాజేందర్ భిక్కనూర్

లక్ష 50వేల రూపాయలు డిపాజిట్ చేస్తే ఐదు సంవత్సరాలలో మూడు లక్షల రూపాయలు ఇస్తామని తెలపడంతో దుబాయ్ లో ఉన్న సమయంలో డబ్బులు పంపించాను. బాండు సమయం ముగిసి రెండు సంవత్సరాలు అవుతున్నా యాజమాన్యం డబ్బులు ఇవ్వడం లేదు.

పైసలు జమ చేసి సంస్థలో చెల్లించిన

- లక్ష్మి భిక్కనూర్

నెలకు 500 రూపాయలు మూడు సంవత్సరాలు చెల్లిస్తే రెండు సంవత్సరాలు ఆగిన తర్వాత 18 వేల రూపాయలకు గాను 36 వేల రూపాయలు ఇస్తామని చెప్పడంతో డబ్బులు కట్టిన. సమయం ముగిసి మూడు సంవత్సరాలు గడుస్తున్న సంస్థ డబ్బులు ఇస్తలే.

కూలీ పని చేసి డబ్బులు పోగుచేసిన



- లక్ష్మణ్ భిక్కనూర్

రోజు కూలి పని చేసి కొంత కొంత డబ్బులు జమ చేసుకొని వెల్ఫేర్ సంస్థలో లక్ష రూపాయలు డిపా జిట్ చేస్తే ఐదు సంవత్స రాల తర్వాత రెండు లక్షల రూ పాయలు ఇ స్తామని తెలిపారు. నా లుగు సంవత్సరాల నుండి డబ్బుల కోసం తిరుగుతున్న ఇవ్వడం లేదు.

మేం శుభ్రం చేస్తాం

- బస్టాండ్‌లో కంపుపై శుభ్రం చేసేందుకు ముందుకు వచ్చిన సైన్యసేన స్వచ్ఛంద సంస్థ
- ఇంకా స్పందించని ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి బస్టాండ్ లో నిలబడాలంటే కంపు భరించవలసి వస్తుందనీ, ప్రయాణికుల ఆవేదన మేరకు బస్టాండ్‌లో కంపు అనే కథనంతో సోమవారం నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించకపోగా.. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్పందించారు. సైన్య సేన అనే స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు ఎర్రల నరేష్ వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన నవతెలంగాణ కథనాన్ని చదవడంతో తన మనసు చెలించిందని, మంగళవారం కామారెడ్డి కొత్త బస్టాండ్ కు వెళ్లి వెళ్లి బస్టాండ్ లోని మూత్రశాలలను తన సొంత డబ్బులు పెట్టి నీటిని తెప్పించి శుభ్రం చేస్తానని తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించకపోవడంతో స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అధికార యంత్రాంగం ఉండి కూడా.. ప్రయివేటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పుడు కేసులు బనాయింపు

- గౌడ కులస్తుల ఆవేదన


రెండు చెట్ల నుంచి గీసిన నీరా

నవతెలంగాణ-ధర్పల్లి

ఉపాధి కోసం నీరా విక్రయించేందుకు ఎక్సైజ్ అధికారులకు విన్నవించుకోగా.. టెస్టింగ్ కోసం రెండు చెట్ల నుంచి రెండు గొబ్బెల నీరా తీస్తే.. గౌడ సొసైటీ ఫిర్యాదు మేరకు తమపై తప్పుడు కేసు బనాయించారని మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్తులు లింగాల రాజేశ్వర్, శ్రీనివాస్ వాపోయారు. రెండు గొబ్బెల నీరా తీస్తే.. 65 లీటర్ల కల్లు దొరికట్టు తమపై తప్పుడు కేసు నమోదు చేశారని సోమవారం వాపోయారు. గౌడ కులస్తులు తమ రెండు కుటుంబాలను 15 నెలల క్రితం కుల బహిష్కరణ చేశారని, అధికారుల, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కానీ కుల సభ్యులు ఫిర్యాదుతో తమపై తప్పుడు కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తన కూతురికి ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి తీసుకెళ్లగా ,పారిపోయినట్లు సంఘ సభ్యులు ప్రచారం చేస్తున్నారని వాపోయారు. శనివారం తమపై కేసు పెట్టించే తరుణంలో, తిరిగి ఎక్కడ వారిపై కేసు పెడతామోనని ముందుగానే పసిగట్టి కొందరు సభ్యులను కలుపుకొని స్థానిక సిఐ భిక్షపతి, ఎస్ఐను కలిసి పరిచయం చేసుకొని శాలువతో సన్మానించారని, దీన్ని అడ్డు పెట్టుకొని రేపటినుండి వారివద్ద కూర్చుండి తమపై లేనిపోని ఆరోపలు చేసే అవకాశం ఉందని వాపోతున్నారు. ఉన్నతాధికా రులు, పోలీసులు స్పందించి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై భీంగల్ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్‌కు వివరణ కోరగా.. 65 లీటర్ల కల్లు దొరికట్టు తెలపడం గమనార్హం. చట్ట ప్రచారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహెూత్సవం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. రేణుక ఎల్లమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం గౌడ కులానికి చెందిన పిల్లలు, పెద్దలు, మహిళలు ఆలయ వద్దకు చేరుకున్నారు. గౌడ కులస్తుల సమక్షంలో రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహెూత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. గౌడ కులస్తులు కళ్యాణ మహెూత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాలు ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆలయానికి స్మార్ట్ టీవీ అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామపంచాయతీ పరిధిలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి మండల కేంద్రానికి చెందిన ఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్ యజమాని అమర్‌నాథ్ 32 ఇంచెస్ గల రూ.13,500 విలువగల టీవీని ఆలయ కమిటీకి సోమవారం విరాళంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామలింగేశ్వర ఆలయానికి నిత్యం భక్తాదులు పోటెత్తడం వారి నిమిత్తం భక్తి ప్రవచనములు, భక్తి పాటల గితాలాపనలతో భక్తులకు ఉత్తేజపరచడం కోసం విరాళంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్ర ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయని ఉత్సాహ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయం వద్ద పందిళ్లు, పోచమ్మ బోనాలు, మంగళవారం శాంతి మంత్ర పఠనం గణపతిపూజ, బుధవారం దేవతపూజ సామూహిక కుంకుమార్చన, గురువారం అమ్మవారి ప్రతిష్టాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఆలయం వద్ద రాత్రి పెద్దమ్మ చరిత్ర ఒగ్గు కథ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజులపాటు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవోదయకు కేరళ స్కూల్ పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల కేరళ టాలెంట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి హర్షిత్ 2023-2024 అకాడమిక్ ఇయర్ నవోదయ పరీక్షలు ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల జిమ్మీ తెలిపారు. పరీక్షలు ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థి తల్లిదండ్రులతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలజిమ్మి విద్యార్థిని అభినందించారు.

బదిలీపై వెళ్తున్న హెూంగార్డులకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

గత సంవత్సర కాలం నుంచి పట్టణ పోలీస్‌స్టేషన్లో విధులను నిర్వర్తించి బదిలీపై నిజామాబాద్ కమిషనరేట్‌కు వెళ్తున్న ఏడుగురు హెూంగార్డులను కామారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుల్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ నిమిత్తమై రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో నర్సవ్వ అనే మహిళ (70)కి బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్తాన్ని మంతిని దేవునుపల్లి గ్రామానికి చెందిన బత్తిని రమేష్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి కేబీఎస్ రక్తనిధి కేంద్రంలో రక్తాన్ని అందజేసినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు లేకపోవడం వల్ల రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కావున మానవతా దృక్పథంతో స్పందించి రక్తదానానికి రక్తదాతలు ముందుకు రావాలన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

నవతెలంగాణ-రామారెడ్డి

పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ కవితను పార్టీ నుండి సస్పెండ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, ఒక తండ్రిగా జైలుకెళ్లి పరామర్శించలిగాని, అధికారాన్ని కోల్పోయి, మతిభ్రమించి మాట్లాడటం మాజీ ముఖ్యమంత్రిగా కెసిఆర్‌కు తగదని జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు రుణమాఫీ చేయక రైతులను మోసం చేసింది పోయి, రైతులపై మొసలి కన్నీరు కార్చడం, దయ్యాలు వేదాలను వల్లించినట్లు ఉందని విమర్శించారు. అధికారంలో ఉండగా కుటుంబ సభ్యులను గాలికి వదిలేస్తే, కుంభకోణాలు చేసి జైలులో ఉంటే చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయంలో, రైతు రుణమాఫీ, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, నిరుద్యోగ భృతి, రైతులకు ఉచిత ఎరువులు, దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి లాంటి ఎన్నో అమలు చేయక ప్రజలను మోసం చేస్తేనే, మీకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. పది సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యేలకు, ఎంపీలతో పాటు మంత్రులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే పార్టీలు మారుతున్నారని, ఎన్ని అబద్ధాలు మాట్లాడినా ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని, రాబోయే రోజుల్లో మరింత గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలు షూరు

నవతెలంగాణ కథనానికి స్పందన


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కోతలు కోసి రోడ్ల పక్కన ఆరబెడుతూ రైతులు ధాన్యం కొనుగోలుకు ఎదురుచూస్తున్న పరిస్థితులు గత కొన్ని రోజులుగా తలెత్తాయి. ఈ సందర్భంలో ధాన్యం కొనుగోలు కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై నవతెలంగాణ దృష్టిసారించి "కొనుగోలుకు ఎదురుచూపులు" అంటూ కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. సోమవారం బోధన్ మండలంలో సంఘం, మినార్ పల్లి, పెగడపల్లి, పెంటాకలాన్, అమ్దాపూర్, బోధన్ సొసైటీలలో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఎట్టకేలకు అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు, సొసైటీ కార్యదర్శులు, ఏవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడాడి కాపురెడ్డి సంఘం ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజీవాడి గ్రామంలో సోమవారం గుడాడి కాపు రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడు కుంట శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి మామిడి రకేష్ రెడ్డి కోశాధికారి ఏనుగు మల్లారెడ్డి, సభ్యులు యాల్ల శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర వాటి గోపాల్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల చట్టాలు, నిబంధనలపై

అధికారులకు అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల చట్టాలు, నిబంధనలపై ఎన్నికల అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛగాను, నిష్పక్షపాతంగాను జరిగే విధంగా ప్రెసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను తమ నియోజకవర్గంలో నుంచి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించే విధంగా ఫారం 12 లను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది సమర్పించిన ఆప్షన్ లో ప్రకారం తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 4 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించి వివరాలను 11 సీ లో పొందపరచాలని చెప్పారు. ఫారం 12 పోస్టల్ బ్యాలెట్ అందనివారు సంబంధిత ఏఆర్ఓకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఉద్యోగి ఓటు ఎక్కడ ఉంటే అక్కడే ఓటు వేసుకుని తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు, మాకు పోల్ నిర్వహించడం, ఈవీఎం, వివి ప్యాట్ , డ్రాఫ్ట్ బాక్స్ నుంచి మాక్ పోల్ స్లిప్పులను తీసివేయడం, వివి ప్యాడ్ మాప్కోల్ పింక్ పేపర్ స్లిప్పులను వెనుక వైపు స్టాంపు చేసిన తర్వాత నలుపు కవర్లో సీల్ చేసే విధానం పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

హోరాహోరీగా ఇసుక వేలం

నవతెలంగాణ-పిట్లం

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వేణు ఆధ్వర్యంలో బహిరంగ నిర్వహించిన ఇసుక వేలం పాట హెూరాహెూరీగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో ఏడుగురు ఇసుక ఆశావహులు పాల్గొన్నప్పటికీ ముందుగా మాజీరా ఇసుకకు వేలం పాట నిర్వహించగా ఒక ట్రాక్టర్ ఇసుకకు సర్కార్ సవాల్ 9 వందల 20 రూపాయలు పాట నిర్ణయించగా త్రిముఖ పోటీ నెలకొంది. పోటీలో నువ్వా నేనా అన్న చందంగా కొనసాగగా మండల కేంద్రానికి చెందిన పి.పామయ్య 5 వేల 9 వందల రూపాయలకు దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని కాకి వాగు ఒక ట్రాక్టర్ ఇసుకను సర్కార్ సవాల్ 9 వందల 20 రూపాయల పాట నిర్ణయించగా ద్వితీయ పోటీ నెలకొన్నప్పటికి హస్నాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ 13 వందల రూపాయలకు దక్కించుకున్నారు. కాగా ఈనెల 21, 30న మద్దెల్ చెరువు(మంజీరా), మండలంలోని కరేగావ్ గ్రామాల నుండి మండల కేంద్రానికి అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేయడముతో ఇసుక వేలం పాట అనివార్యమైంది. ఇట్టి వేలం పాటను మండల మెజిస్ట్రేట్ తహసీల్దార్ వేణుకు బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఇసుక వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమములో మండల ఆర్ఐ శీతల్, సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక వేలంలో పాల్గొన్న పలువురు

ఉపాధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని వజ్జెపల్లి తండాలో సోమవారం ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి గ్రామస్తులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డులను అందిస్తామన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు రావాలన్నారు. గ్రామ చెరువులో పూడిక మట్టి తీసి వ్యవసాయ భూములకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మెట్ భాస్కర్, తాజా మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, ఉపసర్పంచ్ స్రవంతిదేవిసింగ్, తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-నిజాంసాగర్



నిజంసాగర్ మండల కేంద్రంలోని బంజేపల్లి గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నటువంటి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వడ్డీ వ్యాపారుల ఇండ్లు, దుకాణాల్లో సోదాలు


సోదాలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల ఇండ్లు, దుకాణాలు పోలీసులు సోదాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం, అధిక వడ్డీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో గాంధారి మండలం కేంద్రంలోని పలు ఇండ్లు, ఆఫీస్‌లు దుకాణాల సముదాయాల్లో సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గాంధారి ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో సహా పలు ఇండ్లలో దుకాణాల్లో సోదాలు జరిపి విలువైన పత్రాలు, ప్రామిసరీ నోట్లు, బాండ్లు మొదలగునవి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వడ్డీ వ్యాపారం చేసే రవీందర్ గౌడ్, జంగం సంతోష్, జాదవ్ గోపాల్ రావుపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రామాలయంలో హనుమాన్ స్వాములకు భిక్ష

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల రామాలయంలో సోమవారం హనుమాన్ స్వాములు ప్రత్యేక బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



భిక్షలో పాల్గొన్న స్వాములు

రూరల్ ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారంలో లింగేశ్వర్ గుట్ట ఆలయాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చక్రధర్ తాండ (గొల్లగుట్ట) గ్రామంలో వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు



పురస్కారాలతో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద విద్యార్థులకు ఓలంపియాడ్ ఐఐటీ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ లక్కారం రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ లక్కారం సాగర్ సోమవారం తెలిపారు. నలంద ఐఐటీ స్కూల్ 2023-24 విద్యా సంవత్సరం నందు ఈ -అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన ఆర్ఎస్ఎం, ఆర్ఎమ్ఎమ్, కేసెట్, బివిఎస్‌కె, సిసిఎం తదితర ఐఐటీ రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను సుమారు 454 స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన పరీక్షల్లో విద్యార్థులు మొదటి 1, 2, 3 ర్యాంకులను కైవసం చేసుకోవడం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఇలాగే మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని పాఠశాల యాజమాన్యం తెలిపింది. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులకు భారతీయ విద్య భవన్, హైదరాబాద్‌లో ఐఎస్ఆర్ఓ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యమ్ చేతుల మీదుగా షీల్డ్ బహూకరించారు. మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను వెనుక ఉండి ప్రోత్సహిస్తూ మార్గదర్శకాలు చేసిన యాజమాన్యాన్ని ఈ అబ్యాస్ వారు ఘనంగా శాలువా మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయ ఏవో ప్రశాంత్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీల్లో వేలాదిమంది మల్టీపర్పస్ కార్మికులకు సుమారు 5, 6 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పస్తులుంటూ, పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు రెగ్యులర్‌గా రాకపోవడంతో ఇంటి అద్దెలు, కిరాణా సరుకులు, పిల్లలకు చదువులు, వైద్యం విషయంలో కూడా అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామపంచాయతీలో డబ్బులు లేవని, స్పెషల్ ఆఫీసర్ సంతకాలు కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వట్లేదని ఇలా అనేక రకాల సాకులతో కార్మికుల కడుపులు కాల్చడం ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక నిధి, బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నెలలుగా పెండింగులో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు బి.మురళి, జీపీ కార్మికులు రమేష్, సాయిలు, రవి, ప్రభాకర్, రాజన్న, లక్ష్మణ్, గంగాధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న సొసైటీ నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు, హోన్నాజీపేట్, ధర్పల్లి సొసైటీ పరిధిలోని జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ పోశన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్మకాలు జరిపి, గిట్టుబాటు ధర పొందాలని అన్నారు. అనవసరంగా దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో రామడుగు సిఇఓ ప్రవీణ్ కుమార్, ధర్పల్లి సిఇఓ సంతోష్‌రెడ్డి, హొన్నజీపేట్ సిఇఓ గంగానర్సయ్య, ఆయా గ్రామాల సెంటర్ ఇంచార్జిలు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో
ఇబ్బందులున్నాయా..?

- రైతులను అడిగి తెలుసుకున్న కలెక్టర్
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా? అని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యానంపల్లిలో ఖిల్లా డిచ్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట డీ.ఎస్.ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెంచిన టెట్ ఫీజును తగ్గించాలి

- ప్రతి జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పెంచిన టెట్ ఫీజును తగ్గించాలని, అలాగే ప్రతి జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెట్ దరఖాస్తు ఫీజులు పెంచడం ఈ ప్రభుత్వానికి సరైనది కాదని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను మళ్ళీ ఈ ప్రభుత్వం చేయవద్దని అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడిందని, దానికి తగిన మూల్యం చెల్లించిందని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం అధికారం రాకముందు యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను ఆశల మత్తులో ఉంచిందని, ముఖ్యంగా ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిన వ్యవహరిస్తుందని ఇది సరైనది కాదు మార్చుకోవాలని హితవు పలికారు. అనేక ఆశలతో నిరుద్యోగులు యువత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేశారని అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల విషయం మర్చిపోవద్దని ఆయన అన్నారు. ముఖ్యంగా నోటిఫికేషన్ల దరఖాస్తు ధరలు తగ్గిస్తామని ప్రకటించారని ఇప్పుడు పెంచడం ఏమిటని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

గతంలో టెట్ పరీక్షకు సంబంధించి రూ.300 ఉండేదని, ఇప్పుడు దాన్ని ఒక పరీక్షకు రూ.1000 చేశారని, రెండు పరీక్షలు కలిపి రూ.2000 అవుతుందని ఈ దరఖాస్తు ఫీజు కట్టడం నిరుద్యోగులకు భారంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజులను తగ్గించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, నాయకులు సిద్దు, రవి, సూర్య, ఉదయ్, విద్య, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ మండలాధ్యక్షులుగా లక్ష్మణ్



ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకుంటున్న లక్ష్మణ్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరాటి లింగం ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ నిజామాబాద్ మండలాధ్యక్షులుగా లక్ష్మణ్‌కు నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూత్ మండల ప్రెసిడెంట్ సురేష్ నాయక్, మాజీ జడ్పిటిసి మోహన్ నాయక్, డిసిసి డెలిగేట్ జే రమేష్, మల్లారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్, మల్కాపూర్ మాజీ సర్పంచ్ ముప్పా గంగారెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐపిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పలువురు ఏఐపిఎస్యులో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, అందుకు లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని వారు అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్ షిప్స్, ఫీజ్ రియింబర్స్‌మెంట్‌ను, అలాగే హాస్టల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను పూర్తిగా నిర్మూలించాలని వారు కోరారు. ఎస్ఎఫ్ఐ నుంచి పలువురు ఏఐపిఎస్యులో చేరారు. వారికి ఏఐపిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. నూతనంగా సంఘంలో చేరిన వారికి వారంలో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి జిల్లా నూతన కమిటీని ప్రకటిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో వంశీ, శివాజీ, రాహుల్ తదిరులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ ఫీజు పెంపుపై నిరసన

- వైస్ ఛాన్సలర్ (వీసి)దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ విద్యార్థుల కాన్వకేషన్ పెంపునకు నిరసనగా నిజామాబాద్ నగరంలోని జిజి కాలేజ్ ముందర పిడిఎస్యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ విసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న డిగ్రీ విద్యార్థుల కాన్వకేషన్ ఫీజు రూ.700 నుంచి 3,500, ఇతర సర్టిఫికెట్ల రుసుమును పెంచడం అంటే పేద విద్యార్థులపైన ఆర్థికభారం మోపడమేనని, యూనివర్సిటీలో మూడు బ్రాంచ్‌ల నుంచి వచ్చే డబ్బులు సరిపోవటం లేదా అని ప్రశ్నించారు. విసి ఇష్టం వచ్చినట్లు సర్టిఫికెట్ల ఫీజులు పెంచడం సరైనది కాదని, యూనివర్సిటీ పరిధిలో చదువుకుంటున్న వేలమంది డిగ్రీ విద్యార్థులపైన అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు. యూనివర్సిటీలకు బడ్జెట్ కేటాయించకుండా సర్టిఫికెట్స్ ఫీజులు పెంచి విద్యార్థులపైన భారం మోపడం సిగ్గు చేటు చర్య అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఇటువంటి చిత్తశుద్ధి ఉందో విద్యార్థుల ఫీజుల పెంపుదలతో నిరూపితం అయిందని అన్నారు. పెంచిన సర్టిఫికెట్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ పి.డి.ఎస్.యూ నగర నాయకులు వంశీ, సాయిరాం, కళ్యాణ్, రామ్, రాహుల్ రాజు, సంతోష్, సంతోష్, కార్తీక్, వరప్రసాద్, శ్రీకాంత్, మాధవ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలి

- రేంజ్ అధికారి రవి మోహన్ భట్



మాట్లాడుతున్న రేంజ్ అధికారి రవి మోహన్ భట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలని రేంజ్ అధికారి రవి మోహన్ భట్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సెక్షన్, బీట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో రహదారి వెంట రాకపోకలు సాగించే సమయంలో కొందరు బీడిలు, సిగరెట్లు తాగి అగ్గి ఆరకముందే పడేస్తుంటారని, ఇంకొందరు బీడీ అకు కోసం కావాలనే అగ్గి పెడ్తారని అలాంటి వారిపై నిఘా పెట్టాలని అన్నారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తు అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నా రేంజ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఫైర్ బ్లోవర్‌తో మంటలను ఆర్పాలని సూచించారు. అటవీ భూములు కబ్జా కాకుండా చుడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారులు శ్రీనివాస్, అసిఫోద్దిన్, సెక్షన్ అధికారులు బాపురావు, సుబ్బారావు, సురేందర్, ఆనంద్, అతిఖ్‌తో పాటు బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే పెండింగ్ వేతనాల చెల్లింపు

- ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోరాట ఫలితంతోనే పెండింగ్ వేతనాలను ప్రభుత్వం చెల్లించిందని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో గత ఎనిమిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన వేతనాలు రిలీజ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న సందర్భంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మొన్న కార్మికుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను రిలీజ్ చేస్తూ జీవో విడుదల చేసిన నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ పోరాటానికి పాత బడ్జెట్ రిలీజ్ చేయడమే కాకుండా జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడానికి ఆదేశాలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటియూసి నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవో వై.రాము, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రసాద్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఈ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని వారు సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం ధర రూ.2203, బి గ్రేడ్ ధర రూ.2183 ప్రకటించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది ఇంతియాజ్, కిషోర్, సాయిబాబా, హరీష్, రైతులు సాయన్న, శంకర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నేడే సమీకృత పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మంగళవారం ఉదయం 9:30 గంటలకు మండలంలోని రైతు వేదిక మెంట్రాజ్‌పల్లిలో రైతులకు సమీకృత పోషక యాజమాన్యం విషయంపై హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మంగళవారం ఉదయం 9:30 గంటలకు, రైతు వేదిక మెంట్రాజ్‌పల్లికి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తిమ్మాపూర్ రెండు దేవాలయాల్లో చోరీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని రెండు దేవాలయాలలో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని నడిబొడ్డున ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి దేవాలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు పదివేల రూపాయల వరకు దొంగలించినట్లు తెలిపారు. ఏర్గట్ల వెళ్లే రహదారిలో ఉన్న పెద్దమ్మ దేవాలయంలోని హుండీని కూడా ధ్వంసం చేసి డబ్బులను దొంగలించినట్లు తెలిపారు. రెండు దేవాలయాలలో కలిపి సుమారు 13వేల రూపాయల వరకు దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఆవుల దొంగతనంపై విచారణ

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని అవార్ శ్రీనివాస్ రైతు ఇంటి ముందు కట్టి వేసిన ఆవులకు దొంగలు మత్తుమందు ఇచ్చి వాహనాల్లో తరలించేందుకు ప్రయత్నించగా రైతు అప్రమత్తం కావడంతో దొంగలు పారిపోయారు. గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలో రాత్రి సమయంలో దొంగలు సంచరిస్తు 20 ఆవులకు మత్తు మందు ఇచ్చి వాహనాల్లో ఎత్తుకెళ్లారు. అప్రమత్తమైన రైతులు, యువకులు ఆదివారం బిచ్కుంద పోలీస్టేషన్లో ఆవులను దొంగతనం చేస్తున్న దొంగలను పట్టుకోవాలని ఫిర్యాదు చేసారు. సోమవారం ఎస్సై మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి రైతు అవార్ శ్రీనివాస్ ఇంటి వద్దకు వెళ్లి ఆవులకు మత్తుమందు ఇచ్చి దొంగతనానికి యత్నించిన వివరాలను సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. రైతులు తమకు సంబంధించిన ఆవులను రోడ్లపై వదిలేయకుండా తమ ఇంటి వద్ద కట్టివేసి జాగ్రత్తపడాలని తెలిపారు. ప్రధాన కూడలిలో సిసి ఫుటేజీలను పరిశీలించి ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆవులను ఎత్తుకెళ్తున్న దొంగలను తొందరలోనే పట్టుకుంటామని, రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించిన 100కు డయల్ చేయాలని లేదా బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు నేరుగా ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై అన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

బాధిత కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సోమవారం పరామర్శించారు. జాగిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పర్స రాజేశ్వర్ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్ హాల్‌లో రానున్న పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించే సిబ్బందికి మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం మొదటి రోజు పిఒ, ఏపీఓలకు ఈవీఎం మానిటరింగ్, వివి ప్యాడ్, బ్యాలెట్ యూనిట్ కనెక్షన్ తదితర అంశాలపై శిక్షణను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి : అదనపు కలెక్టర్ అంకిత్

ఎన్నికలలో విధులు నిర్వహించే సిబ్బంది అలసత్వం ప్రదర్శించకుండా నిక్కచ్చిగా పనిచేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు ఆదేశాలను అందజేశారు.

ప్రశ్నించే గొంతును గెలిపించుకుందాం

- కలిసికట్టుగా ఉండి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్


పాల్గొన్న కార్యకర్తలు, తదితరులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా ఉండి ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా అన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విటల్‌రావు, నగర మేయర్ దండు నీతుకిరణ్ హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, అంతే ఉత్సాహంతో ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ప్రజల తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వీడిన వారిని పట్టించుకోకండి.. నిరుత్సాహపడకండి.. పార్టీ కోసం పనిచేసే నాయకులు నిఖార్సైన నాయకులకు ప్రజలు అండగా ఉంటారని తెలిపారు. 50 సంవత్సరాలు పరిపాలించిన ఇతర పార్టీ నాయకులు ఏమీ అభివృద్ధి చేయలేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పది సంవత్సరాల్లో ఎనలేని అభివృద్ధి చేసి చూపించిన ఘనత మనదేనన్నారు. రెండవసారి అవకాశం వచ్చింది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఎంపీ అభ్యర్థి దిక్కులేక ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి టికెట్ ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మీర్ మాజాజ్ అలీ, నాయకులు సుజీ సింగ్ ఠాగూర్, సత్య ప్రకాష్, సుదాం రవిచందర్, ప్రభాకర్‌రెడ్డి, ఎనుగందుల మురళి, దారం సాయిలు, నవీన్ ఇక్బాల్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పిల్లి లక్ష్మి(37) కుటుంబంలో గొడవల కారణంగా మార్చి 31న ఉదయం 9:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరింది. ఆమె ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారి ఇళ్లల్లో, గ్రామ శివారులో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం ఉదయం పెద్ద చెరువులో తన భార్య శవంపైకి తేలింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక


ఎంపికైన లోక్షిత్ కన్నాను సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి పాలెపు లోక్షిత్ కన్నా జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్ సోమవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ ఆరవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అడ్మిషన్ పొంది నిజాంసాగర్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో సీటు సాధించిన లోక్షిత్ కన్నాను పాఠశాల యజమాన్య బృందం అభినందించి, శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థిని యాజమాన్య బృందం, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల సౌమ్య, 5వ తరగతి ఉపాధ్యాయురాలు సరిత, ఇతర ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

5 నెలల నుంచి జీతాల్లేవు

- బాలనగర్ జీపీ సిబ్బంది ఆవేదన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బాలనగర్ గ్రామపంచాయతీ పనిచేస్తున్న తమకు 5 నెలల నుంచి జీతాలు లేవని కారోబార్ శేఖర్ అన్నారు. తనతో పాటు మరో ముగ్గురు సిబ్బంది పని చేస్తున్నారని వారికి కూడా జీతాలు లేక కుటుంబం నడిపించలేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. గ్రామపంచాయతీలో కారోబార్‌గా, ట్రాక్టర్ డ్రైవర్‌గా, బిఎల్‌వోగా పని చేస్తున్నానని అన్నారు. ఐదు నెలల జీతాలు చెల్లించాలని ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తామని తెలియజేశారు.

ఈ అభ్యాస అకాడమీ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు



అవార్డులను అందుకున్న లిటిల్‌ఫ్లవర్స్ విద్యార్థులు

నవతెలంగాణ-నవీపేట్

ఈ అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. మార్చ్ నెలలో జరిగిన ఇంటర్ స్టేట్ లెవెల్ ఒలింపియాడ్ పరీక్షలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని మొదటి ర్యాంక్‌ను, 7వ తరగతి విద్యార్థి రాహుల్ 3వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి విఘ్నేష్ 3వ ర్యాంక్ సాధించారు. వీరితో పాటుగా కల్పనాచావ్లా క్రియేటివ్ మైండ్ కంపెటేటివ్ టెస్ట్‌లో 7వ తరగతి విద్యార్థి రాహుల్ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్, అభిజ్ఞ 3వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థినులు ఇందుప్రియ, అతిథిలకు రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్ వచ్చినట్లు స్కూల్ కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్తలు హరినాథ్, రవికుమార్, ప్రముఖ రచయిత ఎంవిఆర్ శాస్త్రి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, జయసింహగౌడ్, ఫణి పవన్ శాస్త్రీ, చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సాంస్కృతిక నృత్య కళారాధనలో విజయ్ విద్యార్థిని


ప్రశంసాపత్రాన్ని అందుకున్న చైత్ర

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి సన్నిధిలో నిత్యకళారాధన వేదికలో శుక్రవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేదికలో కూచిపూడి నృత్యంలో భాగంగా విజయ్ హైస్కూల్లో 1వ తరగతి చదువుతున్న జి.చైత్ర ఆనంది పాల్గొని ప్రశంసాపత్రాన్ని అందుకున్న విద్యార్థినిని విజయ్ హైస్కూల్ యాజమాన్యం అభినందించారు.

ఎన్నికల కోడ్‌లో ఫ్లెక్సీలా..?

- పట్టించుకోని రిటర్నింగ్ అధికారులు


బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ..

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ఓ నాయకుడిది ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. చలివేంద్రం ఏర్పాటు చేయటం మంచిదే అయినా ఎన్నికల కోడ్ ఉండగా పార్టీ ఫ్లెక్సీ ఉండటం నిబంధనలకు విరుద్ధమని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ కొనసాగుతుండగా పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసినా.. ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

సహజీవనం చేసి మోసం

- కాంగ్రెస్ నాయకులు ముప్ప గంగారెడ్డిపై చర్యలు తీసుకొని న్యాయం చేయండి
- కలెక్టర్‌లో బాధిత మహిళ ఫిర్యాదు


ఏఓకు ఫిర్యాదు అందజేసిన బీడీ కార్మికురాలు చంద్రకళ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

'సార్.. నాకు న్యాయం చేయండి' అంటూ బీడీ కార్మికురాలు తాటోజు చంద్రకళ కోరారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన చంద్రకళ అనే బీడీ కార్మికురాలు తన కుమారుడితో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ ప్రశాంత్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముప్ప గంగారెడ్డి అనే వ్యక్తి రహస్యంగా 20 సంవత్సరాలుగా నాతో సహజీవనం చేస్తున్నాడని, 20 సంవత్సరాల క్రితం తనను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఇప్పటివరకు వివాహం చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపింది. ఆ క్రమంలో తమకు కుమారుడు పుట్టాడని, ఇప్పుడు ఆ కుమారుడు తమకు పుట్టలేదని గంగారెడ్డి అంటున్నాడని, డిఎన్ఏ పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పుకొచ్చింది. తాను గుండె సంబంధిత వ్యాధితో పాటు, అనారోగ్య సమస్యతో బాధపడుతున్నానని, ఈవిషయంలో గంగారెడ్డికి డబ్బుల కోసం సంప్రదిస్తే.. చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తాను అంత చూసుకుంటానని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు మీడియా ముందు వాపోయింది. తనకు ఎలాగైనా న్యాయం చేయాలని కోరింది.

సత్తాచాటిన లిల్లీపుట్, నారాయణ విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్, నారాయణ పాఠశాలల విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనిష్, సాయి ప్రవర్ష, అలీషా ఫాతిమా, లయ విజేతలుగా నిలిచారని, వీరికి గాను భారతీయ విద్యా భవన్‌లో హైదరాబాదులో ఈ అభ్యాస్ వీరికి ఇస్రో సైంటిస్టుల ద్వారా బహుమతులు ప్రదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాలలోని విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల విజేతలుగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని, తమ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని అభినందించారు.

జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో మెరిసిన నారాయణ విద్యార్థిని..

పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న డీకే అక్షర అనే విద్యార్థిని ఒలంపియాడ్ పరీక్షలో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజని కుమారి సోమవారం తెలిపారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జీఎం గోపాల్ రెడ్డి విద్యార్థిని బహుమతితో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏజీఎం శివాజీ పటేల్, నరేష్ తదితరులు విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు.

యూనివర్సిటీ కాన్వకేషన్ ఫీజులో ఎలాంటి పెరుగుదల లేదు

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాన్వకేషన్ ఫీజులో ఎలాంటి పెరుగుదల లేదని విద్యార్థులు ఆందోళన చెందవద్దని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల విభాగానికి సంబంధించి అన్ని రకాల ఫీజులు గతంలో ఉన్నట్టుగానే ఫీజు స్ట్రక్చర్ ఉంటుందని విద్యార్థులకు రిజిస్ట్రార్ తెలిపారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిచ్‌పల్లి సీఐ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాత్రి దొంగలు పడి హుండీని దొంగిలించుకుపోయినట్టు డిచ్‌పల్లి సిఐ మల్లేష్ తెలిపారు. ఈ విషయంలో గుడి కమిటీ సభ్యులు ఇచ్చిన దరఖాస్తు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సిఐ మల్లేష్, ఎస్ఐ మహేష్, జక్రాన్‌పల్లి ఏఎస్ఐ వెంకట్‌కుమార్ సీసీ కెమెరాలను పరిశీలించారు.

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా
చర్యలు చేపట్టాలి

- ఎంపిడిఓ బాలకృష్ణ


మాట్లాడుతున్న ఎంపిడిఓ బాలకృష్ణ

నవతెలంగాణ-ధర్పల్లి

వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ బాలకృష్ణ అన్నారు. సోమవారం గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా, నీటిని వృథా చేయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఒ రాజేష్, ఏఈ, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి సద్వినియోగంపై అవగాహన..

వేసవి తీవ్రతను ఎదుర్కొనేందుకు ప్రజలు తమ వంతు కృషి చెయ్యాలని ఎంపిడిఓ బాలకృష్ణ అన్నారు. మండలంలోని మోహిదీన్‌సాబ్ తండా, చేరు తండాల్లోని ప్రజలకు నీటి వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రజలు తమ వంతుగా నీటిని వృథా చేయకుండా అరికట్టేందుకు, అవసరమైన మేరకు నీటిని ఉయోగించుకోవాలని అన్నారు. వృథాగా పోనియ్యకుండా చూడాలని అన్నారు. వేసవిలో భూగర్భ జలాలు ఎండి రానున్న కొద్దిరోజుల్లో నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, తండా ప్రజలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-నవీపేట్

పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారు జగ్గారావు ఫారం సమీపంలో ఒక గుర్తుతెలియని మగ మనిషి శవం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామ కారోబార్ సతీష్ ఫిర్యాదు మేరకు ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుమారు 50-55 సంవత్సరాల వయసు గల మగ మనిషి బ్లూ కలర్ గీతల అంగి, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు. పాస్పోర్ట్ సైజ్ ఫోటో జేబులో ఉంది. ఈ వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే నవీపేట్ పోలీసులకు సంప్రదించాలని కోరారు. కారోబార్ సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధిస్తాం

- ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల సమన్వయ కర్త శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధిస్తామని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల సమన్వయ కర్త ఉల్లెంగ శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణ శివారులోని గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సోమవారం విద్యార్థుల అవార్డుల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంతో చదివితే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని ఆయన అన్నారు. బట్టీ విధానాన్ని పక్కనపెట్టి నూతన విద్యా విధానానికి అనుగుణంగా చదివితే జాతీయస్థాయిలో పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపగలరని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ యాజమాన్యం ఎల్లవేళలా కృషి చేస్తామని అన్నారు. తదనంతరం పాఠశాల పరిపాలనాధికారి పద్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పినటువంటిది తూచా తప్పకుండా పాటించి చదువుతోపాటు సంస్కారాన్ని పెంచుకొని సమాజంలో గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.